క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: తెలంగాణ ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు మండల విద్యాధికారి మురళినాయక్ తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరానికి గాను జూన్ 12నుంచి జూలై 11 వరకు అడ్మిషన్లు తీసుకోవచ్చన్నారు. 14 ఏళ్లు నిండి, పదో తరగతి పూర్తి చేయనివారు అలాగే పదో తరగతి ఫెయిల్ అయిన వారు పదో తరగతి చదివేందుకు అవకాశం ఉందన్నారు. 15 ఏళ్లు నిండి ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన లేదా ఇంటర్మీడియట్ చదవని వారు ఇంటర్ పూర్తిచేసేందుకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9491560739లో సంప్రదించాలన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు..

2025–26 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్, ఆదిలాబాద్, హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి మురళినాయక్ ఒక ప్రకటనలో కోరారు. ఒక్కో పాఠశాలలో బాలికలకు 20 సీట్లు, బాలురకు 20 సీట్లు ఉంటాయన్నారు. ఈనెల 15 సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మండలస్థాయి సెలక్షన్స్ ఈనెల 17న ధర్మారం ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు పీఈటీ సంతోష్‌కుమార్ 9290555534లో సంప్రదించాలన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బోయినపల్లి: మండలంలోని తండగొండలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయవ్యాధిపై బోయినపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.కార్తీక్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం ఉన్న తేమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, శశికుమార్, హేమలత, ఎస్టీఎస్ గంగాధర్, ఎంపీహెచ్‌ఏ లింగం కుమార్, అశోక్, ఏఎన్‌ఎంలు వసంత, ఉష, శ్యామల, ఆశలు సునీత, అనసూర్య, లత, కారొబార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల కార్యవర్గం



ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్ పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడిగా ల్యాగల సంపత్ ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా ఎండీ రంజాన్, పయ్యావుల కనకయ్య, ల్యాగల నరేందర్, ఆశిల్ల రాజయ్య, కేతిరెడ్డి రమేశ్ రెడ్డి, కరివేద భాగ్య, కోలాపురం సుశీల, కేతిరెడ్డి ప్రదీప్ రెడ్డి, కొటం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పసుల వెంకటి, సూపర్వైజర్లు వెంకటరెడ్డి, సతీశ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ తీస్తున్న విద్యార్థినులు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థినుల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం నిర్వహించారు. రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.జయ మాట్లాడుతూ...యువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.వాణిశ్రీ, ఎన్‌సీసీ సీటీవో ఏ.శ్రీకళ, స్టాఫ్ రమేశ్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛతా హీ’ సేవ

వేములవాడఅర్బన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల ఆవరణలోని కలుపు మొక్కలను తొలగించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న, దీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పంట ధ్వంసంచేసిన ఇద్దరిపై కేసు

వేములవాడరూరల్: పంట ధ్వంసంచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అంజయ్య తెలిపారు. వేములవాడ మండలం హన్మాజిపేటకు చెందిన ఎల్లాల విజయకు చెందిన భూమిని తమ భూమి అంటూ అందులోని పంటను ధ్వంసంచేసిన కోనరావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన రాజిరెడ్డి, భార్య లతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరోగ్య ‘సిరి’ ధాన్యాలు

- పట్టణ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- మారిన ఆహారపు అలవాట్లు
- చిరుధాన్యాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు



ఆరోగ్యవంత జీవనంలో చిరు ధాన్యాలు ముఖ్య కారణంగా చెప్పొచ్చు. నిత్యం తీసుకునే ఆహారంలో ఒక్క పూటైనా ఏదో రకమైన చిరు ధాన్యం రకాన్ని తీసుకుంటున్నారు. అనారోగ్యం నుంచి బయటపడేందుకు తీసుకునే ఆహారంలో ఆరోగ్యాన్నిచ్చే ‘సిరి’ధాన్యాలపై మక్కువ చూపుతున్నారు. ఇటీవల చిరు ధాన్యాలకు పెరిగిన డిమాండ్‌పై సండే స్పెషల్ కథనం..

సిరిసిల్ల టౌన్ : వివిధ దీర్ఘకాలిక జబ్బులున్నవారికి చిరు ధాన్యాలు ఔషధంలా పనిచేస్తున్నాయి. ఇవి తింటే సులువుగా జీర్ణమవడంతో పాటు శరీరంలో చక్కెరను అదుపులో ఉంచుతాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్, రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండటంతో వీటి వినియోగం ఇప్పటి తరాలకు తప్పనిసరైంది. వీటి వినియోగంతో జీర్ణశక్తి పెరిగి శరీరానికి బలం చేకూరుతుంది. వీటిలో పీచు పదార్థాలు, పోషక విలువలు ఎక్కువగా ఉండటంతో చాలామంది పౌష్టికాహారంగా తీసుకుంటున్నారు. బీపీ, షుగర్‌తో పాటు ఇతర జబ్బులున్న వారు ఆరోగ్యం కాపాడుకునేందుకు చిరు ధాన్యాలను తీసుకుంటున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ప్రభుత్వమే చిరు ధాన్యాలతో తయారైన ఆహారాన్ని పౌష్టికాహారంగా అందిస్తుంది.

పెరిగిన డిమాండ్.

చిరు ధాన్యాలకు మార్కెట్లో రోజురోజుకూ డిమాండ్ పెరడంతో పట్టణంలో విక్రయ దుకాణాలు పెరిగాయి. దంతో చిరువ్యాపారులకు నిత్యం ఉపాధి అందుతోంది. కొందరు వ్యాపారులు సిరిధాన్యాలను శుభ్రపరిచి, పిండిగా మార్చి రెడీమేడ్‌గా అందిస్తున్నారు. బిజీగా ఉండేవారు వీటిని నేరుగా వినియోగిస్తున్నారు. కూరగాయల మార్కెట్, పెద్ద బజార్, పాత బస్టాండ్, ప్రాంతాల్లో చిన్న తరహా దుకాణాలు మొదలుకుని సూపర్‌మార్కెట్లలో విక్రయిస్తున్నారు. డిమాండ్ మేరకు వ్యాపారులు హైదరాబాద్, వరంగల్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసి అమ్మకాలు జరుపుతున్నారు.

ఎన్నో.. ఉపయోగాలు

చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి ఎన్నో ఉపయోగాలుంటాయి. పాతకాలంలో వరి ధాన్యంతో పాటు గోధుమలు, జొన్నలు, మక్కలు వంటివి తీసుకునే వారు. మారిన ఆహారపు అలవాట్లు మనిషిని అనారోగ్యం పాలు చేయడంతో చిరు ధాన్యాలు అనుములు, రాగులు, మిటికిల్లు, పెసర్లు, సజ్జలు, తెల్ల ఉలువలు, కొర్రలు తదితరాలు విరివిగా లభ్యమవుతున్నాయి. మారిన ఆహారపు అలవాట్లలో వీటి ప్రాధాన్యత తగ్గినా..ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు వీటిని ఎక్కువగా తీసుకుంటున్నారు. జంక్‌ఫుడ్‌తో ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. వాటి దుష్ప్రభావాలు తగ్గాలన్నా..సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నా.. చిరు ధాన్యాలు వినియోగించాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.



ఆరోగ్యకరం



చిరు ధాన్యాలతో ఆరోగ్య దాయకం. రోజు అల్పాహారంగా అయినా తీసుకోవాలి. రాత్రి వేళలో జొన్న, మక్క, చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహారం మంచిది. షుగర్ కంట్రోల్ అవుతుంది. కొలెస్ట్రాల్ పెరగదు. ఒబెసిటీ కూడా రాదు. జంక్‌ఫుడ్, ఆయిల్ ఫుడ్, వరి, పులుపు ఆహార పదార్థాలు తక్కువగా తీసుకోవాలి.

–డాక్టర్ సంతోష్,
జిల్లాసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్

పోషకాలు అధికం



చిరుధాన్యాలు బలమైన ఆహారం. ఇందులో పోషకాలు అధికం. చాలామంది వీటిని నేరుగా తినేందుకు ఇష్టపడరు. అందుకే వీటిని మిశ్రమంగా తీసుకున్నా ఆరోగ్యానికి మంచిదే. వీటిలో కాల్షియం, మినరల్స్‌తో పాటు ఫైటో కెమికల్స్ సమృద్ధిగా ఉంటాయి. రక్తంలో చక్కెర పాళ్లను సమంగా ఉంచుతాయి. రాగుల్లో ఐరన్ అధికం.

– అయ్యప్ప రాము, విక్రయదారుడు

సంపూర్ణ ఆరోగ్యం



తృణధాన్యాలు, చిరు ధాన్యాలకు మేము వాడుతున్నాం. ఆహారంలో చిరుధాన్యాల వినియోగం సంప్రదాయమే కాదు సంపూర్ణారోగ్యం ఇస్తాయి. కొవ్వు పదార్థాలు ఉండకపోవడం వల్ల శరీర బరువును తగ్గిస్తాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా ఇంట్లో వాళ్లందరూ వీటిని తీసుకోవడం మంచిది.

– బైరి రమాదేవి,
ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

హామీలు అమలు చేయకుండా నోటీసులా?

- తెలంగాణ ఉద్యమ పాఠ్యాంశాన్ని తొలగిస్తారా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

సిరిసిల్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావుకు ఏసీబీతో నోటీసులు ఇప్పించారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. సిరిసిల్లలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, బట్టకాల్చి మీద వేసేందుకు ఈ ఫార్ములా రేస్‌కోర్సు కేసులో ఏసీబీతో నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆంధ్రా నేతలతో చేతులు కలిపి రూ.50లక్షలు ఇస్తూ అడ్డంగా దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. లైవ్ డిటెక్షన్ పరీక్షలకు సిద్ధమని కేటీఆర్ ప్రకటించారని, ఆ సవాల్‌ను రేవంత్‌రెడ్డి స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు రైతుభరోసా, సన్నవడ్లకు బోనస్ రాలేదన్నారు. నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వకుండా అందాల పోటీల్లో రూ.కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. కేసీఆర్ పేరును చెరిపివేయాలనే కుట్రతోనే పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉన్న ఉద్యమచరిత్రను తొలగించారన్నారు. ప్రజల గుండెల్లో ఉన్న కేసీఆర్‌ను చెరిపేయడం రేవంత్‌రెడ్డి తరం కాదన్నారు. కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, ఎదురుగంట్ల చంద్రయ్యగౌడ్, గుండారపు కృష్ణారెడ్డి, దార్ల సందీప్, కుంభాల మల్లారెడ్డి, దిడ్డి రాజు, కంచర్ల రవిగౌడ్, రమేశ్, జవహర్‌రెడ్డి, అమర్‌రావు, ప్రేమ్‌కుమార్, బూర తిరుపతి, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

జ్వరంతో వృద్ధురాలి మృతి



దేవవ్వ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: జ్వరంతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. కిషన్‌దాస్‌పేటకు చెందిన వెలుముల దేవవ్వ (65)కు రెండ్రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఆస్పత్రిలో చూపించగా మందులు రాసి ఇంటికి పంపారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురైంది. తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా దేవవ్వ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దేవవ్వ భర్త మల్లారెడ్డి గతంలోనే మృతిచెందాడు. ఇద్దరు కుమారులు ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కూతురు లక్ష్మి ఉన్నారు.

వ్యక్తిపై దాడి

సిరిసిల్ల అర్బన్: భూవివాదంలో జరిగిన దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పట్టణ పరిధిలోని చంద్రంపేటకు చెందిన కొలకాని నర్సయ్య కుమారుడు శ్రీనివాస్, కొలకాని అంజయ్య కుమారుడు పర్శరాములకు కొంతకాలంగా భూములు, ఇళ్లస్థలాల విషయంలో గొడవలు జరగగా పెద్దమనుషుల సమక్షంలో ఇంటి స్థలాలు పంపిణీ చేసుకున్నారు. పర్శరాములు స్థలంలో శ్రీనివాస్ ఇంటి నిర్మాణం కోసం ముగ్గుపోశాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరగడంతో శ్రీనివాస్ పర్శరాములుపై కత్తితో దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు 108లో ఏరియా ఆసుపత్రికి, అక్కడినుంచి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు రాలేదన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



ఎల్లారెడ్డిపేట : ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గంభీరావుపేట: సముద్రలింగాపూర్‌లో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ నాయకులు గంట బుచ్చాగౌడ్, అంతర్పుల గోపాల్, బీపేట రాజు, తిరుపతిగౌడ్, రాజుకుమార్, ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

గంభీరావుపేట: సముద్ర లింగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన 36 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు నాయకులు తెలిపారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల తిప్పలు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో ప్రధాన రోడ్డు పక్కనే పైపులు ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. గ్రామంలో రహదారి పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మించేందుకు సిమెంట్ పైపులు తెచ్చి రోడ్డుపై పెట్టారు. ఏళ్లు గడుస్తున్నా పనులు జరగడం లేదు. పైపులు తీయడంలేదు. ఈ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో రోజూ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పైపులను రోడ్డుపై నుంచి తొలగించి రవాణాకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.



‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధం కావాలి

ఎల్లారెడ్డిపేట: స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత 16 నెలల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వం పది పైసలు పనిచేసి రూపాయి ప్రచారం చేసుకుందని.. కాంగ్రెస్ ప్రభుత్వ పనిచేసినా ప్రచారం చేసుకోవడంలో వెనుకపడ్డామన్నారు. ఇప్పటికైనా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల దగ్గరకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఆరు గ్యారంటీలు, సన్నబియ్యం పంపిణీ, రేషన్‌కార్డుల మంజూరు గురించి ప్రచారం చేయాలని కోరారు. సీనియర్ నాయకులకు సముచిత అవకాశాలు దక్కుతాయన్నారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచించారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు సమీపంలోని సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న వంతెన వద్ద సైడ్ వాల్స్ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఏర్పాటు చేసిన సైడ్ వాల్స్ కూలిపోయాయి. కొత్తవి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నరేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, 9440818863

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మాజీ ఉపసర్పంచ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్ వందమంది అనుయాయులతో కలిసి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని తాటికొండ రాజయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరినవారికి కండువాకప్పి ఆహ్వానించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పేదలకు సేవలందించాలన్నారు. పార్టీలో క్రమశిక్షణతో పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో కముటాల వేణు, కముటాల రాజు, తాటికిండ అనిల్, ఎర్రబెల్లి రాజశేఖర్, వంగర కిరణ్ ఉన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు రొండి రాజు, కచ్చకాయల ఎల్లయ్య, సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేక వెనుకబడిన వేములవాడ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని 5, 6, 9, 10వ వార్డుల లో పలు అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజాప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఇవ్వని రేషన్‌కార్డులను తమ ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. వర్షాకాలం ముగియడంతోనే రెండో బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, వైస్‌చైర్మన్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే కేటీఆర్‌కు నోటీసులు



మాట్లాడుతున్న మనోహర్

ముస్తాబాద్: రాజకీయ కక్ష సాధింపులతోనే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు పంపించిందని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కేటీఆర్‌కు వస్తున్న పేరును చూసి ఓర్వలేక ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్ రేసులపై లైవ్ డిటెక్టర్ పరీక్షలకు కూడా సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ ఇదివరకే ప్రకటించిన, ప్రభుత్వం నుంచి స్పందన రాలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టిని మరల్చేందుకే ఇలాంటి నోటీసులు ఇస్తున్నారన్నారు. బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు దిలీప్, జహంగీర్, నరేంద్రచారి, మల్లేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కోనరావుపేట: మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన సందర్భంగా వికసిత్ అమృత్ కాలం సేవ కార్యక్రమాన్ని మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు జింక వెంకటి, అనుపాటి బాపురెడ్డి, అంబోజి లక్ష్మీనారాయణ, రమేశ్, మధు, అఖిల్, చల్ల జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

ముస్తాబాద్: సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ లక్ష్యంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం పని చేసిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు పూర్తయిందని, మోదీ పాలనలో దేశంలో సంక్షేమం, అభివృద్ధి వేగంగా జరుతుందన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మెరుగు అంజాగౌడ్, పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్, మండల ఉపాధ్యక్షుడు ఎదునూరి గోపి, తిరుపతి, మల్లేశ్, వెంకటేశ్, శ్రీనివాస్ రావు, శ్రీకాంత్, రాంగోపాల్, కృష్ణ, శ్రీను, మహేశ్, బాల్‌రెడ్డి, భగత్‌రెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి: ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబ్బాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురాం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహా చారి మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, శరత్, విజయేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, సారంపల్లి రాజు, మోహన్ బాబు, ఇల్లందుల బాలయ్య, ప్రభు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

రక్తదానం

ఎల్లారెడ్డిపేట: ప్రాణపాయంలో ఉన్నప్పుడు రక్తదానంతో ఓ ప్రాణాన్ని కాపాడవచ్చు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలానికి చెందిన పలువురు రక్తదానం చేశారు. ఇప్పటివరకు మండల కేంద్రానికి చెందిన వంగ గిరిధర్‌రెడ్డి 50సార్లు, ఎడ్ల లక్ష్మణ్ 28సార్లు, ఉపాధ్యాయుడు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి 19సార్లు, శివరామకృష్ణ 19సార్లు రక్తదానం చేశారు. రక్తదాన దినోత్సవం సందర్భగా శనివారం సిరిసిల్లలో రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న గిరిధర్ రెడ్డి